

# కథా కౌముది

## బలిపశువు

డా.మూల రవికుమార్

"చింతల వలస వాళ్ళు దిగాలోయ్". కండక్టర్ కేకతో కిరణ్ తన బేగూ, సూట్ కేసూ పట్టుకుని దిగాడు. బస్సు దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయింది. తను బస్సు దిగిన చోటకి ఎదురుగా ఉన్న స్కూలు బిల్డింగ్ పై 'ప్రాథమిక పాఠశాల, చింతలవలస, సాలూరు మండలం, విజయనగరం జిల్లా' అని రాసి ఉంది. అది చదివి 'హమ్మయ్య, సరిగ్గానే వచ్చాను' అనుకున్నాడు. పక్కనే ఉన్న కిళ్ళీ బడ్డీలో ఒక లెమన్ సోడా తాగి డబ్బులిచ్చాక ఆ షాపతన్ని, "ఇక్కడ ఫారెస్టాఫీసెక్కడ?" అని అడిగాడు.

షాపతను స్కూలు ఆవరణలో ఆడుకుంటున్న పిల్లల్లో ఒకణ్ణి కేకేసి "ఇతన్ని ఫారెస్టాఫీసు కాడికి తీసుకెళ్ళరా" అన్నాడు. "అలాగే" అని వాడు నడవటం మొదలెట్టాడు. వెనకే కిరణ్.

అలా పదినిమిషాలు నడిచాక "అదిగో.. అదే పారట్టాపీసు" అని ఆ పిల్లాడు వెనక్కి తిరిగి పారిపోయాడు, ఆటోలో చేరాలన్న ఉద్దేశ్యంతో. కిరణ్ ఆఫీసు వరండా దగ్గరకి రాగానే అక్కడే ఉన్న ప్యూన్ "ఎవర్ని కలవాలి సార్?" అని అడిగాడు.

"సాలూరు రేంజి ఫారెస్టాఫీసర్ గారిని కలవాలి. వైజాగ్ నుంచి వచ్చాను" అన్నాడు కిరణ్.

ప్యూన్ వెంటనే లోపలి గదిలో కెళ్ళి, మరో క్షణంలో బయటికి వచ్చి "సార్ లోపలున్నారు. వెళ్ళి కలవండి" అన్నాడు.

కిరణ్ లోపలికెళ్ళి సూట్ కేసూ, బ్యాగ్ కిందపెట్టి, "నమస్తే సర్. అయామ్ కిరణ్ తేజా, పి.హెచ్.డి. స్కాలర్. జువాలజీ డిపార్ట్‌మెంట్, ఆంధ్రా యూనివర్శిటీ, వైజాగ్" అని పరిచయం చేసుకున్నాడు.

ఫారెస్టాఫీసర్ "నైస్ టు మీట్ యూ, బీ సీటెడ్ ప్లీజ్" అంటూ షేక్ హేండిచ్చి "అప్పన్నా. మంచినీళ్ళు తీసుకురా" అంటూ ప్యూన్‌ని కేకేసాడు.

కిరణ్ మంచినీళ్ళు తాగిన తరువాత ఫారెస్టాఫీసర్‌గారన్నారు "మీరు వస్తున్నారని మీ ప్రొఫెసర్ గారు వారం క్రితం చెప్పారు. ఫోన్ లో కదా అని మీ థీసిస్ వర్క్ వివరాలు అడగలేదు" అని.

"ఈ చింతలవలస నుంచి ఇంటీరియర్ ఫారెస్ట్‌లోనికెళితే, కింగ్ కోబ్రాలుంటాయట కదా, వాటి జీవిత చరిత్ర, అలవాట్లు స్టడీ చెయ్యటమే నా పి.హె.డి. థీసిస్ కి ప్రాజెక్ట్ వర్క్" అని కొంచెంసేపాగి,

"ఐ నీడ్ యువర్ కైండ్ హెల్ప్!! డేటా కలెక్షన్ మూడు నెలలూ ఇక్కడే ఉండాలి. ఆ తర్వాత థీసిస్ రైటింగ్‌కి వెజాగ్ వెళ్ళిపోతాను"

"అప్పన్నా కిరణ్‌గారి సామాన్లు వరండా పక్క రూములో పెట్టు" అని "మీరు ఈ మూడు నెలలూ ఆ గదిలోనే ఉండవచ్చు. ఈ ఆఫీస్ ఎదురుగా ఉండే ఇంట్లోనే అప్పన్న ఉంటాడు. మీకు ఎప్పుడేం కావాల్సి వచ్చినా తనని అడగండి" చెప్పారు ఫారెస్టాఫీసర్.

"సెల్ఫ్ కుకింగ్ చేసుకుందామనుకుంటున్నాను. బాగానే ఉంటుందా సార్."

"ఎందుకండీ, బస్టాప్ దగ్గర్లో ఉన్న టీ కొట్టూ వాడికి నెలకి ఐదొందలిస్తే ఉదయం టీ, టిఫిన్, మధ్యాహ్నం లంచ్, రాత్రి భోజనం అన్నీ మా గదికే పంపించేస్తాడు. నేను మా ఫామిలీని సాలూరు తీసుకొచ్చేవరకూ అదే చేసేవాణ్ణి"

"అలాగే సార్. రేపట్నుంచి నేను డేటా కలెక్షన్ మొదలుబెడతాను"

"మీరు తాపీగా ఇక్కడ సర్దుకున్నాక మీ డేటా కలెక్షన్ మొదలుపెట్టండి. ఈ చుట్టుపక్కల ఉండే చిన్న చిన్న పల్లెటూర్లలో కొండ దొరలుంటారు. అప్పన్న వాళ్ళని పిలిపిస్తాడు. వాళ్ళ సాయం లేకుండా ఎప్పుడూ అడివిలోనికెళ్ళొద్దు."

"ఇంతకంటే చిన్న పల్లెటూర్లుంటాయా?" కిరణ్ ఆశ్చర్యంగా అడిగాడు.

"ఈ చుట్టు పక్కల పదికిలోమీటర్ల పరిధిలో ఇదే అన్నింటికంటే పెద్ద ఊరు. అడివిలోపలి కెళితే ఒక్కో ఊర్లో పది పదిహేను గుడిసెల కంటే ఎక్కువ ఉండవు. ఆ గుడిసెలు కూడా ఒకదానికొకటి వందేసి గజాల దూరంలో ఉంటాయి."

"మరి అక్కడ ఉండేవాళ్ళకి టైం పాస్ ఏమిటి సార్?"

కిరణ్ సందేహానికి ఆయన పెద్ద పెట్టున నవ్వి

"ఎండాకాలంలో నీళ్ళు తెచ్చుకోవటం వాళ్ళకి పెద్ద టైంపాస్. వానాకాలంలో వాళ్ళ గుడిసెలలోనికి నీళ్ళు వచ్చెయ్యకుండా గట్టు కట్టుకోవటం, అది తెగిపోయినప్పుడల్లా మళ్ళీ వేసుకోవటం టైం పాస్. ఇవికాక అన్ని కాలాల్లోనూ నక్కలూ, తోడేళ్ళు వాళ్ళ పశువుల్ని చంపెయ్యకుండా కాసుకోవటం, అడవి పందులూ, ఎలుగుబంట్లూ వాళ్ళ పొలాల్నీ, పంటల్ని నాశనం చెయ్యకుండా చూసుకోవటం కూడా టైంపాస్. ఇలాంటి వాటి మధ్య తీరిక దొరికినప్పుడు అడివిలోనికెళ్ళి వెదురు కర్రలు, తేనె, వేటాడిన జంతువులులాంటివి తెచ్చి చుట్టుప్రక్కల ఊళ్ళలో అమ్ముకుంటారు. ఎక్కువ మొత్తంలో సేకరించిన వాటిని మానాపురం సంతకి తీసుకెళ్ళి అమ్ముతారు."

"మానాపురం, అంటే నాకు బస్సులో వస్తూ ఉంటే తగిలిందీ, అదేనా?"

"ఆఁ అదే. అక్కడ ప్రతీ శనివారం పెద్ద సంత జరుగుతుంది".

"వీళ్ళ కోసం ప్రతీ శనివారం ట్రక్కు ఏదైనా వెళుతుందా?"

కిరణ్ సందేహాలకి వస్తున్న నవ్వు ఆపుకుంటూ చెప్పారు "వీళ్ళంతా సంతలకి నడిచివెళ్ళి నడుచుకుంటూనే వస్తారు. సంతలో, ఊహించని దానికంటే ఓ పది రూపాయలు ఎక్కువ వస్తే మాత్రం బస్సెక్కుతూ ఉంటారు."

"బాప్‌రే! ముప్పై కిలోమీటర్ల దూరాన్ని నడుచుకుంటూ అంతంత బరువులు మోస్తారా?"

"రోడ్డుమీంచి అయితే ముప్పై కిలోమీటర్లుగానీ, పొలాల్లోంచీ నడిస్తే ఓ పది కిలోమీటర్ల దూరం తగ్గుతుంది."

కిరణ్ ఆశ్చర్యంతో మరి మాట్లాడలేదు.

ఫారెస్టాఫీసరే అడిగార్ "మీకేమైనా ఫైనాన్షియల్ అసిస్టెన్స్ ఉందా?"

"రిసెర్చ్ అసిస్టెంట్ షిప్, నెలకి పన్నెండు వందలు వస్తుంది."

"వైజాగ్‌లో అది సరిపోకపోవచ్చుగానీ ఇక్కడ మాత్రం అన్ని ఖర్చులూ పోను మూణ్ణాలుగొందలు ప్రతినెలా మిగలవచ్చు."

ఇంతలో అప్పన్న టీలు తీసుకువచ్చాడు. టీలు తాగుతూ "అప్పన్నా, ఇతను పెద్ద నాగులు మీద పరిశోధన చెయ్యాలి. రేపట్నించీ మూడు నెలలు మన ఆఫీసు వరండా గదిలోనే బస. ఇతనికి ఏ ఇబ్బందీ లేకుండా చూడు. రేపు ఈ ఊళ్ళలో ఎవరైనా కొండ దొరల్ని పిలిపించి ఇతనితో ఎప్పుడూ ఎవరో ఒకరు వెళ్ళేటట్టు చూడు" చెప్పారు ఆఫీసరుగారు.

"గదబ వలసలో చిలకన్న దొరకి రాజనాగులు గురించి బాగా తెలుసు సార్. రేపు రమ్మని కబురు పెడదాం" అప్పన చెప్పాడు.

"ఆ దొరకి డబ్బులెంతివ్వాలి సార్?" కిరణ్ సందేహం.

"మీరు వాళ్ళకి డబ్బులివ్వటంలాంటివేవీ అలవాటు చెయ్యకండి. ఫారెస్టూ, రెవిన్యూ,పోలీసు డిపార్టుమెంటుల్లో ప్యూనులున్నా ఈ దొరలు చాలా భయపడతారు" కొంచెం గట్టిగానే చెప్పారు ఆఫీసర్.

"ఎందుకని?"

"వాళ్ళు అడివిలో వేటాడ్డం, చెట్లు కొట్టడం లాంటివన్నీ చేసి బతుకుతారు. మేం అభ్యంతరం పెడితే అవేవీ చెయ్యలేరు. అడివేమైనా వాళ్ళ బాబుగారి సొమ్ముకాదు కదా!" వెంటనే వాచీ చూసుకుని "టైం ఐదవుతోంది. రేపు కలుద్దాం. మీరు రెస్ట్ తీసుకోండి" అన్ని చెప్పి కిరణ్‌కి మరోసారి షేక్ హాండిచ్చి వెళ్ళిపోయారు ఫారెస్టాఫీసర్‌గారు.

ఆ రాత్రి కిరణ్ తను తెచ్చుకున్న రికార్డులూ, వర్కుప్లానూ మరోసారి చూసుకున్నాడు. 'కిన్నెరసాని వైల్డ్ లైఫ్ సేంక్ట్యురీ'లో తను తీసుకున్న ట్రైనింగ్ వివరాలూ భువనేశ్వర్ 'జూ'లో తను నోట్ చేసుకున్న, తెలుసుకున్న 'హేబిట్స్ ఆఫ్ కింగ్ కోబ్రా' మరోసారి రిఫ్రెష్ చేసుకున్నాడు. తనకి ఈ ప్రాజెక్టులో చోటు దొరకడం వల్లే చాలా విలువైన ట్రైనింగ్ కోర్సులు యూనివర్శిటీ నిధులతో తీసుకోగలిగాడు. తను అనుకున్న విధంగా పి.హెచ్.డి. గనక అయిపోతే ఆర్డినరీ 'జువాలజీ' డాక్టరేట్ కన్నా తన అవకాశాలు ఎంతో మెరుగ్గా ఉంటాయి అనుకున్నాడు.

మర్నాడుదయాన్నే చిలకన్న దొర వచ్చాడు. అతడికి ముప్పై అయిదేళ్ళ వయసుంటుంది. శరీరం నల్లగా బలిష్టంగా ఉంది. అప్పన్న అతడికి కిరణ్ గురించీ, కిరణ్ ప్రాజెక్ట్ గురించీ చెప్పి "ఒరేయ్ చిలకా, నువ్వు ముందు అడివంతా తిరిగి పెద్దనాగులు ఎక్కడెక్కడుంటాయో చూసి గుర్తుపెట్టుకుని, ఆ తర్వాత కిరణ్ గారిని తీసుకెళుదువుగాని. ఈ రోజు అడివిలోకెళ్ళి వస్తున్నప్పుడు ఒక నెమలి పిట్టనిగాని, అడివి కోడిని గానీ తీసుకురా. ఈ రాత్రికి మా ఈరకాడు పట్నం నుంచి చుట్టపు చూపుకు వస్తున్నాడు' అన్నాడు.

దొర "అలాగేనండీ" అని వెళ్ళిపోయాడు.

కిరణ్ అప్పన్నతో "నెమళ్ళకు. అడివి కోళ్ళనూ వేటాడ్డం నేరం కదా! నువ్వు ఇలా చెప్పేవని తెలిస్తే మీ ఆఫీసరుగారు కోపం పడరా?" అన్నాడు.

అప్పన్న నవ్వి "మన ఆఫీసరు గారు కూడా వారానికి ఒకసారి ఏదో ఒక అడివి మాంసం తింటారు. ఈ చుట్టు పక్కల ఎవరైనా అడివి పందుల్ని గానీ, కణుజుల్ని గానీ, అడివి మేకల్ని గానీ వేటాడితే, ఎస్సై గారికీ, ఎమ్మార్వో గారికీ మన ఆఫీసర్ గారికీ కేజీకి తక్కువకాకుండా మాంసం ఇళ్ళకి పంపిస్తారు. అంతెందుకు, ఈ మధ్యనే మన జిల్లా మంత్రిగారి మనవరాలు పెద్ద పిల్లైతే చాలామందికి అడివి మాంసంతోటే భోజనాలు పెట్టారు".

"మరి ఇవేవైనా పేపర్లలో వస్తే చాలా ప్రమాదం కదా!?"

"విలేకర్లకి మాత్రం మాంసం చేదా ఏటి. కావాలంటే కేజీ వందకి తక్కువ లేదు"

చట్టాలెంత బాగా పనిచేస్తున్నాయో కిరణ్‌కి అర్థమైంది. "అయితే ఈ రోజు మీ ఇంట్లో స్పెషల్ డిన్నర్ అన్నమాట" అప్పన్నతో అన్నాడు నవ్వుతూ.

"నా అంతట నేనెప్పుడూ ఇలా చెప్పలేదండీ. ఏదో ఈ రోజు మా బావ మరిది వస్తున్నాడు కదా అని" అప్పన్న వివరించాడు.

మొదటి వారం రోజులూ కిరణ్ అడివిలోనికెళ్ళలేదు. చిలకన్న దొర మాత్రం రోజూ సాయంత్రం వచ్చి ఆ రోజు తనకు తెలిసిన వివరాలు చెబితే, ఫారెస్టాఫీసర్ గారు మేప్ సహాయంతో కిరణ్‌కి ఎక్స్‌ప్లెయిన్ చేసేవారు. కిరణ్ నోట్స్ తీసుకునేవాడు. తను థియరీలో నేర్చుకున్న విషయాల్ని దొర చెప్పిన విషయాల్నీ పోల్చుకునేవాడు.

కింగ్ కోబ్రా పదిహేను అడుగుల పైనే పొడవు పెరుగుతుంది. దాని ఒక కాటులో ఉండే విషం వంద నాగుపాము కాట్ల విషానికి సమానం. అది పడగ ఎత్తితే ఏడడుగుల వరకూ ఉంటుంది. ఎంతపొడవైన మనిషినైనా తలమీద కాటెయ్య గలదు. అన్నిపాము కాట్లకీ ప్రస్తుతం ఏంటీ వీనం దొరుకుతుంది గానీ, ఈ కింగ్ కోబ్రాకి మాత్రం విరుగుడు మందు దొరకదు. నాగుపాముతో సహా ఇతర అన్ని పాముల్నీ పారిపోతాయిగానీ ఇది మాత్రం వెంటబడి మరీ కాటేస్తుంది. దాని బుస వంద గజాల దూరం వరకూ వినపడుతుంది.

బ్రీడింగ్ సీజన్‌లో ఆడపాము వంద వరకూ గుడ్లు పెట్టి, వాటి చుట్టూ చుట్టుకుని అరవై రోజుల తర్వాత అవి పిల్లలయ్యే వరకూ కాపలా ఉంటుంది. ఇన్ని రోజులూ దానికి తిండీ, నిద్రా ఉండవు. నలభయ్యో రోజు నుంచీ పడగ ఎత్తలేనంత నీరసించి పోతుంది. గుడ్లు పిల్లలవగానే తల్లిపాము తన నోటికి అందినవన్ని పిల్లల్ని తినేస్తుంది. అది మళ్ళీ తన శక్తిని కూడగట్టుకోవటానికి నెలరోజులైనా పడుతుంది.

అడవిలో ఈ రాజనాగులు తిరిగే ప్రాంతాల్లో కూడా తిరగగలిగే వాళ్ళు చాలా అరుదు. వాళ్ళల్లో దొరకూడా ఒకడు. వాళ్ళకి తెలిసిన ఒక ప్రత్యేకమైన మూలిక ఉంటుంది. దీని బుస వినగానే అది వచ్చేదారిలో ఈ మూలిక పెడతారు. అది మూలిక వాసనకి మైకంలో ఉండిపోతుంది. అప్పుడు వీళ్ళు ఆ మూలికను తీసుకుని వచ్చేస్తారు.

"అలా దొరికిన పాముల్ని మీరు చంపెయ్యరా?" కిరణ్ దొరని అడిగాడు.

"ఆటని సంపఁవని పెమాణం సేసినాకనే మా పెద్దలు మాకు మూలిక రగస్యం సెప్పినారండీ" దొర చెప్పాడు.

నాగరిక సమాజంలో చట్టాలకీ, అనాగరికులుగా పిలవబడేవాళ్ళలో ఉండే కట్టుబాట్లకీ ఉండే తేడా గురించి ఆలోచించాడు కిరణ్.

అడవి గురించీ, అందులో తను చూడాల్సిన అంశాల గురించీ అవగాహనకి రావటానికి వారం రోజులు పట్టింది కిరణ్‌కి. ఆ తర్వాత మొదటిసారి అడవిలోని కెళ్ళినపుడు దొరతో పాటు అప్పన్న కూడా వచ్చి మేప్‌లోని అంశాన్ని 'డీకోడ్' ఎలా చేసుకోవాలో చెప్పాడు కిరణ్‌కి. ఆ మర్నాటి నుంచీ కిరణ్‌తో దొరా, దొర తమ్ముడూ సాయంగా వెళ్ళేవారు.

దొరకీ, తమ్ముడికీ బైనాక్యులర్స్‌ని ఉపయోగించటంలో 'ట్రైనింగ్' ఇచ్చి, చెట్లు ఎక్కటంలో వాళ్ళ దగ్గర 'ట్రైనింగ్' తీసుకున్నాడు కిరణ్.

కింగ్ కోబ్రా స్థావరానికి కనీసం అరమైలు దూరంలోకి వచ్చారనగా, దొర తన తమ్ముణ్ణి కిరణ్‌కి సాయం ఉంచి తను మూలిక తీసుకుని దాని స్థావరం వైపు వెళ్ళేవాడు. వీళ్ళిద్దరూ ఇక్కడ ఎత్తైన చెట్టెక్కి, పాముకి మైకం కమ్మిన విషయం బైనాక్యులర్స్ ద్వారా దొర సైగల్ని చూసి నిర్ధారించుకుని దాని దగ్గరకు వెళ్ళేవారు. దాని పొడవు, సుమారుగా బరువు, ఇంకా ఇలాటి వివరాల్నీ, గుడ్లు పెట్టిన ఆడ పామైతే, ఆ గుడ్ల సంఖ్య అన్నీ కిరణ్ నోట్ చేసుకుని వైట్ ఇంక్‌తో ఆ పాము తలమీద మార్క్ చేసి వదిలేసేవారు. ఒక్కోసారి రోజంతా తిరిగినా దాని ఆచూకీ తెలిసేదికాదు లేదా మార్క్ చేసిన పాము మళ్ళీ దొరికేది. ఇలా రెండు నెలలకి పైగా నడిచిన డేటా కలెక్షన్ పీరియడ్‌లో నాలుగు మగపాముల్నీ, పది ఆడ పాముల్నీ కిరణ్ తన కెమేరాలో బంధించగలిగాడు. ఈ కాలంలో కిరణ్ ఎన్నో భయంకర దృశ్యాలు చూసాడు. ఒకరోజు దారిలో అడవి మేకను మింగుతున్న కొండ చిలువ కనిపించింది. మేక తల పూర్తిగా దాని నోట్లోనికెళ్ళిపోయింది. మేక నాలుగు కాళ్ళూ గిలగిలా కొట్టుకుంటున్నాయి. దొర దాన్ని చూడగానే తన గొడ్డలితో మేక మెడ నరికేసాడు. తన కొండ చిలువ నోట్లో ఉండిపోయింది. మొండెం దొర తెచ్చేసాడు. ఆ రోజు గదబవలస వాళ్ళంతా దాని మాంసం తిన్నారు. ఆఫీసర్లందరికీ ఇళ్ళకి మేక మాంసం పంపబడింది.

మరో రోజు తెల్లవారు ఝామున వీళ్ళు ముగ్గురూ చింతలవలస పొలిమేర లోనికొచ్చేసరికి బాంబు పేలిన శబ్దం వినిపించింది. అటుపక్క వెళ్ళి చూస్తే వేరు శనగ వేసిన పొలంలో ఒక అడవి పంది చచ్చిపడి ఉంది. దానికింద దవడ తల నుండి విడి దూరంగా పడి ఉంది. వేరుశనగ పంటల్ని నాశనం చేస్తే అడవి పందుల్ని చంపటానికి మాంసం ముక్కలో నాటు బాంబులు పెట్టి ఎరవేస్తారు. అడవి

పంది ఐదొందలు కేజీల వరకూ ఉంటుంది. మనిషి గనక దానికి విడిగా దొరికితే, పిల్లి ఎలకని తీసికెళ్ళినంత ఈజీగా అది మనిషిని నోట కరచుకుని పట్టుకెళ్ళిన సందర్భాల గురించి దొర చెబుతూ ఉంటే కిరణ్‌కి ఒళ్ళు జలదరించింది.

ఇవికాక ముళ్ళ పందులూ, కనుజులూ, నెమళ్ళూ లాంటివన్నీ చాలా తరచుగా కనిపించేవి కిరణ్‌కి. డేటా కలెక్షన్ దాదాపుగా ఐపోవచ్చింది. ఆ రోజు ప్రొఫెసర్ గారు స్వయంగా వచ్చారు. ఒక రోజు సాలూరు గెస్ట్ హౌస్‌లో రెస్ట్ తీసుకుని మర్నాడుదయాన్నే అడివిలోకి బయలుదేరారు. ఆ రోజు వీళ్ళతోపాటు ఫారెస్ట్ ఆఫీసరూ, అప్పన్న కూడా బయలుదేరారు. అప్పన్న తుపాకీ, గోడ బాంబులు కూడా పట్టుకున్నాడు. వీళ్ళందర్నీ ఒకచోట కూర్చోబెట్టి దొరా, తమ్ముడూ వెళ్ళి ఒక ఆడపామునీ, ఒక మొగపామునీ తీసుకుని వచ్చారు. ఆ పాముల్ని పట్టుకుని కిరణూ, ఆఫీసరూ, ప్రొఫెసర్ గారూ ఫోటోలు తీయించుకున్నాక వెనుదిరిగారు. దారిలో దూరంగా వెదురు పొదలో కనిపించిన అడవి కోడిని అప్పన్న కాల్చాడు. అది చచ్చి కిందపడింది గానీ ఆ శబ్దానికి అదే పొదలో పిల్లలు పెట్టిన ఒక అడవి పంది చెదిరి, వీళ్ళవైపు పరుగెత్తి రావటం మొదలెట్టింది. అప్పన్న చెట్టెక్కి తుపాకీలో మరో తుటా పెట్టే ప్రయత్నంలో పడ్డాడు. కిరణూ, ఆఫీసరూ వేర్వేరు చెట్లెక్కేసారు. ప్రొఫెసర్ గారు చెట్టెక్కలేకపోతూ ఉంటే దొరా, తమ్ముడూ ప్రొఫెసర్ గారి రెండు కాళ్ళూ పట్టుకుని పైకిలేపితే పైనుంచి ఆఫీసర్ గారు చెయ్యందించి ఆయన్ని చెట్టుమీదకి చేర్చారు. దొరా, తమ్ముడూ పూర్తిగా చెట్లెక్కేలోపే అది దగ్గరకి వచ్చేసి దొర ఎక్కుతున్న చెట్టు మొదలుకి ముందు కాళ్ళు ఆనించి నిలబడి అతడి కాలు అందుకుంది. మనిషి చెరుకు ముక్క కొరికినట్టుగా అతడి పాదాన్ని కొరికింది. అప్పుడే అప్పన్న తుపాకీలో తూటా అమర్చటం పూర్తిచేసి దాని తలమీద కాల్చేడు. అడవి పంది కింద పడింది గానీ దాని కోరలు పాదంలో దిగబడటం వల్ల దొర కూడా కింద పడ్డాడు. దొర తమ్ముడు వెంటనే చెట్టుమీంచి గెంతి దొరని పక్కకి లేపి కూర్చోబెట్టి, చచ్చిపడిన పంది మెడ నరికేసాడు. మిగిలిన వాళ్ళంతా చెట్టుమీంచి దిగారు. దొరపాదం, పంది రెండు దవడల మధ్యా ఇరుక్కుపోయింది. అందరూ కలిసి లాగితే దవడలు వేరయ్యాయి గానీ పాదం సగం కట్ అయిపోయింది. రక్తం కారుతూన్న దొర పాదానికి ఒక టవల్ కడితే నిమిషంలో అంతా రక్తంతో తడిసిపోయింది అందరూ కలిసి అతణ్ణి ఊరోకి తీసుకొచ్చి, వెంటనే సాలూరు గవర్నమెంట్ హాస్పిటల్ కి తీసుకెళ్ళారు. ఫారెస్టాఫీసర్ కూడా ఉండటం చేత హాస్పిటల్ వాళ్ళు వెంటనే రెస్పాండ్ అయి దొరకి కట్టు కట్టి, బెడ్ ఎలాట్ చేసారు. ఆ సాయంత్రమే ప్రొఫెసర్ గారు వైజాగ్ వెళ్ళిపోయారు. కిరణ్ మరో పదిరోజులు అక్కడే ఉన్నాడు. ఫారెస్టాఫీసర్ స్వయంగా పట్టించుకోవడం వల్ల దొర మందులకేమీ ఖర్చు కాలేదు. దొర భార్యా, తమ్ముడూ హాస్పిటల్‌కీ ఇంటికీ తిరగటానికయ్యే బస్సు చార్జీలు కిరణ్ పెట్టుకున్నాడు. దొర డిశ్చార్జ్ అవుతున్నప్పుడు అతడి చేతిలో ఐదొందలు పెట్టి తన రెండు జతల పాత బట్టలు ఇచ్చాడు కిరణ్. దొర మాటల్లో "మీ వల్లే నేను కుంటుతూ నడుస్తున్నాను" అన్న భావనకి బదులు ఎంతో కృతజ్ఞత చూసి కిరణ్‌కి చాలా ఆశ్చర్యం వేసింది. దొర భార్యకీ, తమ్ముడికీ ధైర్యం చెప్పి, అప్పన్నకీ ఫారెస్టాఫీసర్‌కీ థాంక్స్ చెప్పి వైజాగ్ వచ్చేసాడు.

మరో నెలరోజుల్లో థీసిస్ రైటింగూ, సబ్ మిషనూ ఆ తర్వాత నెలన్నరకి వైవా కాగానే కిరణ్‌కి డెహ్రాడూన్ వైల్డ్ లైఫ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో పోస్ట్ డాక్టరేట్ ఫెలోగా టెంపరరీ ప్లేస్ మెంట్ నెలకి పదివేల రూపాయల జీతం మీద దొరికింది.

కిరణ్ కింగ్ కోబ్రా మీద చేసిన రిసెర్చ్ పేపర్, వైల్డ్ లైఫ్ కన్జర్వేషన్ పై.

పారిస్‌లో జరిగిన సెమినార్‌లో ప్రెజెంటేషన్‌కి ఎంపిక అయింది.

ఆ నిమిత్తమై ప్రొఫెసర్ గారు ప్రాజెక్ట్ నిధులతో పారిస్ వెళ్ళివచ్చారు.

ఈ పరిశోధనలో క్షేత్రస్థాయిలో సహకరించినందుకు గాను ఫారెస్ట్ ఆఫీసర్‌గారు యూనివర్సిటీ నుంచి ధన్యవాదములూ, ప్రభుత్వం నుంచి ప్రశంశా పత్రమూ అందుకున్నారు.

చిలకన్న దొర గాయం నయమైనా, తెగిన పాదంతో కుంటుతూ నడుస్తున్నాడు. చింతలవలస రామ్మందిరం బయట ఉన్న లౌడ్ స్పీకర్లోంచి ఒక శ్లోకం వచ్చాకా, తాత్పర్యం వినిపిస్తోంది: లోక కళ్యాణం కొరకు రక్త సంప్రోక్షణ జరగాలి. ఆ రక్తం కూడా ఏ పాపమూ చెయ్యని వారిదై ఉండాలి. అటువంటివారు మనుషుల్లో దొరకరు గనక యజ్ఞ యాగాల్లో పశువులని బలి ఇస్తారు.

నిజమే మరి!!

Click here to share your comments on this story